క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన బొయిరే శంకర్, జంపాల బాపు, బోయిరే పెంటులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులు మంజూరు కాగా సోమవారం లబ్ధిదారులకు బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్ ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మధుకర్, నానయ్య, ప్రభాకర్, హరీశ్, బావాజీ, గంగరాం, శ్రీనివాస్, మహేశ్, సాయికిరణ్, మోహన్, తిరుపతి, రవీందర్, అంజన్న, సమయ్య తదితరులు పాల్గొన్నారు.

'సోమిని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి'



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని కుశ్నపల్లి నుంచి సోమిని వరకు ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా మారిందని తాజా మాజీ ఎంపీటీసీలు ఆత్రం సాయి, లంగారి శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 12 ఆదివాసీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని, రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు జిల్లాలోనే విద్యాబోధన చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సిర్పూర్ (టి) గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లాలోనే అద్దె భవనం చూసి విద్యాబోధన చేయాలని సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ సిర్పూర్(టి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల విద్యార్థులను భవనం శిథిలావస్థలో ఉండటంతో జైపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, జగిత్యాలకు పంపించారన్నారు. దూరభారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని, జిల్లాలోనే అద్దె భవనం తీసుకుని దసరా సెలవుల అనంతరం విద్యాబోధన చేయాలని కోరారు. నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



పాల్గొన్న అధికారులు, నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో నెలకొన్న సమస్యలను యాజమాన్యం సత్వరమే పరిష్కరించాలని ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు జగ్గయ్య, మారం శ్రీనివాస్, ఆనంద్, రామయ్య, అశోక్‌లు డిమాండ్ చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏరియాలో నెలకొన్న పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్ కోసం కొత్తగా బోరుబావి ఏర్పాటు చేసి క్లబ్ పైకప్పుకు మరమ్మతులు చేయించాలన్నారు. పార్కులో పిల్లల ఆట పరికరాలకు మరమ్మతులు, ఖైరిగూర ఓసీపీలో బైక్ పార్కింగ్ షెడ్డు నిర్మించాలన్నారు. సమావేశంలో ఎస్వోటూజీఎం రాజమల్లు, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, సీహెచ్‌పీ హెచ్‌వోడీ కోటయ్య, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సివిల్ డీజీఎం ఎస్కే మదీనాభాషా తదితరులు పాల్గొన్నారు.

'వర్షవాస్' ముగింపునకు మంత్రికి ఆహ్వానం

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో అక్టోబర్ 7న నిర్వహించే వర్షవాస్ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర బొగ్గు గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని సోమవారం బౌద్ధ సంఘాల నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. వర్షవాస్ కార్యక్రమం వివరాలను మంత్రికి వివరించారు. సమత సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధార్థ రామ్మూర్తి, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, నాయకులు సునీల్ డోంగ్రె తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా యూరియా



యూరియా కోసం గ్రోమోర్ సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

- మండలానికి చేరిన 92 లారీల యూరియా
- రైతులకు అందని వైనం
- సొసైటీల వద్ద బారులుతీరుతున్న అన్నదాతలు

బెజ్జూర్: మండలానికి యూరియా చేరింది.. కానీ రైతులకు సరిపడా యూరియా మాత్రం అందడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం మండలానికి 92 లారీలు వచ్చినప్పటికీ సొసైటీల వద్ద బారులు తీరిన రైతన్నలు మాత్రం నిరాశతో వెనుదిరుగుతున్నారు. పొద్దంతా నిలబడి చివరికి రెండు బస్తాలే అందుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎకరానికి రెండు బస్తాలు ఇవ్వాల్సిన చోట ఒక రైతుకు రెండు బ్యాగులే ఇస్తుండడంతో పంటల పెరుగుదలపై ప్రభావం పడనుంది. అయితే నకిలీ రైతుల పేర్లపై యూరియా మహారాష్ట్రకు అక్రమంగా తరలిపోతుందన్న ఆరోపణలు అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి.

మహారాష్ట్రకు తరలిన యూరియా?

బెజ్జూర్ మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 28,442 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. సగానికి పైగా రైతులు పత్తి పంట వేశారు. గతంలాగే ఈసారి కూడా వేసవి ప్రారంభంలోనే యూరియా డీసీఎంఎస్ ద్వారా రైతులకు అందుబాటులోకి వచ్చింది. అయితే వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా డీసీఎంఎస్ ద్వారా వచ్చిన యూరియా అసలైన రైతులకు అందక, నకిలీ రైతులకు యూరియా చేరుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీసీఎంఎస్ ద్వారా వచ్చిన యూరియా సగానికి పైగా పక్కనే ఉన్న మహారాష్ట్రకు తరలుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

మండలానికి చేరిన యూరియా..

బెజ్జూర్ మండలానికి 92 లారీల యూరియా చేరినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉత్సరంగపాలి (సలుగుపాలి) డీసీఎంఎస్ ద్వారా 6 లారీలు, రెబ్బెన గ్రామం పేరిట 15 లారీలు, పోతేపెల్లి 17, సోమిని 13 లారీలు ఏఆర్ఎస్‌కే ద్వారా 5 లారీలు, బెజ్జూర్ మండల కేంద్రంలోని సొసైటీకి 28 లారీలు, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు 20 లారీలు, గ్రోమోర్ సెంటర్‌కు 10 లారీల యూరియా చేరింది. సరిపడా యూరియా చేరుకున్నా రైతులకు మాత్రం దొరకడం లేదు. దీంతో యూరియా కోసం క్యూలో బారులుతీరిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు బస్తాలతో సరి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ఎకరానికి రెండు బస్తాల యూరియా ఇవ్వాల్సి ఉంది. అలా కాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో పంట సాగుకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరానికి రెండు బస్తాలు ప్రభుత్వం నుంచి వచ్చినా నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని వాపోతున్నారు. మండలానికి సరిపడా యూరియా చేరుకున్నా ఒక రైతుకు రెండు బ్యాగులు మాత్రమే ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఒక్క బస్తా కూడా అందలేదు..



నేను పది ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఇప్పటివరకు సొసైటీ, డీసీఎంఎస్ ద్వారా ఒక్క యూరియా బస్తా కూడా అందలేదు. ప్రైవేట్ ద్వారా కొనుక్కొని యూరియా, డీఏపీ వేస్తున్నాను. ఆర్థిక భారంగా మారింది. అధికారులు స్పందించి మా గ్రామంలో యూరియా కొరత లేకుండా చూడాలి.
– కొడప సత్యావన్, నాగెపల్లి

సరిపడా అందించాలి



ఒక్క ఎకరానికి రెండు బ్యాగుల యూరియా ఇవ్వాల్సింది ఒక్క రైతుకు రెండు బస్తాలు ఇస్తున్నారు. ఈ రెండు బ్యాగుల యూరియా ఎటూ సరిపోవడం లేదు. ఇప్పుడు పంట ఎదుగుదల కోసం యూరియా చాలా అవసరం. అధికారులు రైతుల బాధలు అర్థం చేసుకొని ఎకరానికి 5 బస్తాలు ఇవ్వాలి.
– కుమ్మరి శంకర్, బెజ్జూర్

తెరువక ముందే బారులు



దహెగాం: గ్రోమోర్ సెంటర్ ఎదుట బారులుతీరిన రైతులు



పెంచికల్‌పేట్: ఎల్కపల్లి రైతు వేదిక వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

దహెగాం: వరి పొట్ట దశలో ఉంది, పత్తి పూత, కాత దశలో ఉండగా వచ్చే నెలలో పత్తి చేతికొచ్చే సమయమైనా యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రోమోర్ సెంటర్‌లో యూరియా పంపిణీ చేస్తున్నారని రైతులకు సమాచారం తెలియగానే ఉదయం గ్రోమోర్ సెంటర్ ముందు రైతులు బారులుతీరారు. కేంద్రం తెరవక ముందే రైతులు వచ్చి ఉన్నారు. యూరియా బస్తాలు పంపిణీ చేయగా తీసుకొని వెళ్లారు. రైతులు అధిక సంఖ్యలో రావడంతో ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదిక వద్ద రైతులు సోమవారం యూరియా కోసం బారులుతీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 444 బస్తాల యూరియా రాగా వ్యవసాయశాఖ అధికారులు ముందుగా టోకెన్లను జారీ చేసిన రైతులకు అందజేశారు. పెద్దఎత్తున తరలివచ్చిన రైతులు ఏవో మనీషా వాహనాన్ని అడ్డుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని ప్రైవేటు వ్యాపారులకు వచ్చిన 240 బస్తాల యూరియా పంచాలని రైతులు డిమాండ్ చేశారు.

కౌటాల: మండలంలోని కౌటాల రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు సోమవారం బారులుతీరారు. మండలానికి చేరుకున్న యూరియాను పక్కదారి పట్టిస్తుండడంతో యూరియా సరిపడా దొరక్క ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

యూరియా టోకెన్ల కోసం రోడ్డెక్కిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌కృష్ణ

రెబ్బెన: యూరియా పంపిణీకి కావాల్సిన టోకెన్లను అందించాలని కోరుతూ సోమవారం రైతులు మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించారు. టోకెన్ల కోసం ఉదయం నుంచి ఎదురుచూస్తుండగా అధికారులు కొత్త వారికి టోకెన్లు జారీ చేయకపోవడం సరికాదని ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. పాత వారికి పంపిణీ పూర్తయ్యాకే కొత్త వారికి టోకెన్లు ఇస్తామనడం సరికాదని నిరసన తెలిపారు. కొత్త వారికి కూడా టోకెన్లు అందజేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే అధికారులు ఎంతసేపటికీ టోకెన్లు ఇవ్వకపోవడంతో మరోసారి రోడ్డెక్కి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకట్‌కృష్ణ రైతుల వద్దకు చేరుకొని వారితో మాట్లాడారు. టోకెన్లు అందించేలా చూస్తామని రైతులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు. అధికారులతో మాట్లాడి రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు.

'సమగ్ర విచారణ జరపాలి'



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: యూరియాపై అధికారులు సమగ్రణ విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వర్గీయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బెజ్జూర్ మండలానికి దాదాపు 96 లారీల యూరియా వచ్చినా ఇప్పటివరకు రైతులకు అందలేదని, డీసీఎంఎస్ ద్వారా వచ్చిన యూరియా ఏమైందని ప్రశ్నించారు. మండలానికి సరిపడా యూరియా వచ్చినా గ్రామాల్లో రైతులకు అందడం లేదని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులపై విచారణ జరపాలని పేర్కొన్నారు. మాజీ కోఆప్షన్ మెంబర్ బషారత్ ఖాన్, జావిద్ అలీ, రామకృష్ణ, సకారాం, రాజారాం, శేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీకి తిప్పలు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న వైకుంఠధామం

- ఏళ్లుగా అసంపూర్తిగా శ్మశానవాటిక
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి: చివరి మజిలీకి తిప్పలు పడొద్దని అన్ని గ్రామపంచాయతీల్లో శ్మశాన వాటికల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో శ్మశాన వాటిక నిర్మాణం కోసం ఆరేళ్ల క్రితం రూ. 12 లక్షల నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. శ్మశాన వాటిక వద్ద బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు మృతదేహాలను దహన సంస్కారాలు చేసేందుకు అనువుగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో కొంత వరకు కష్టాలు తప్పాయి. మండలంలోని దాదాపు అన్ని పంచాయతీల్లో వైకుంఠధామాల నిర్మాణం పూర్తయ్యి వినియోగంలో ఉండగా, మండల కేంద్రంలోని శ్మశాన వాటిక మాత్రం నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.

నిలిచిన పనులు..

రూ.12 లక్షలతో వైకుంఠధామం నిర్మాణం కోసం కాంట్రాక్టు తీసుకున్న సదరు గుత్తేదారు పనుల కోసం ముందస్తుగా అడ్వాన్స్ రూపంలో గ్రామపంచాయతీకి సంబంధించిన నిధుల నుంచి కొంత తీసుకొని పనులు ప్రారంభించాడు. 70శాతానికి పైగా పనులను సైతం పూర్తి చేశాడు. అందుకు సంబంధించి అప్పటి అధికారులు ఎంబీ రికార్డు చేసి రూ 3.30 లక్షల నిధులను సైతం కాంట్రాక్టర్ ఖాతాల్లో జమ చేశారు. పనులు పూర్తయిన తర్వాత మిగితా పనులకు సంబంధించి ఎంబీ రికార్డు నమోదు చేసి నగదును గుత్తేదారు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంపై ఆసక్తి చూపకపోవడంతో వైకుంఠధామం అలంకారప్రాయంగా మారింది. పూర్తి స్థాయిలో నిధులు విడుదలైతే కాంట్రాక్టర్ అడ్వాన్స్ రూపంలో తీసుకున్న రూ.5 లక్షల నగదు కూడా జమయ్యే అవకాశం ఉంటుంది. శ్మశాన వాటిక లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రజలు వాగు, వంకల సమీపంలో మృతదేహాల దహన సంస్కారం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని క్షేత్రస్థాయిలో వైకుంఠధామం పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం..

మండల కేంద్రంలోని శ్మశాన వాటిక పనులను పూర్తి చేయించేందుకు సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతాం. వీలైనంత త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడుతాం.
– వేముల మల్లేశం, ఎంపీడీవో, తిర్యాణి

మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు



దహెగాం: మంగళహారతులతో మహిళల పూజలు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గాదేవి కొలువు దీరింది. గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా భక్తులు కంకణాలు ధరించారు. వేద పండితుడు పరమేశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన దుర్గాదేవిని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దర్శించుకున్నారు. సోమవారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్, ఆర్యవైశ్య యూత్ అధ్యక్షుడు పుల్లూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్వకర్మ గాయత్రీ శ్రీ శివపంచాయతన సహిత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, పైకాజీనగర్‌లో సోమవారం శారదాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు మహేశ్‌చారి ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ స్థాపన, కలశపూజ, గౌరిపూజ, అమ్మవారి ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సురేశ్‌చారి, భాస్కరచారి, రాధాకృష్ణచారి, వరప్రసాద్, రమేశ్‌చారి, రాజేశ్వర్, సంతోష్, హరీశ్, నారాయణ, శ్రీనివాస్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఖైరిగూర ఓసీపీ ఉపరితల ఆవరణలోని దుర్గామాత ఆలయంలో ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రాజెక్టు అధికారి నరేందర్, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, మేనేజర్ శంకర్, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ ఏరియా, సర్‌సిల్క్ పార్క్‌లైన్, ద్వారకానగర్, కాపువాడ ,న్యూకాలనీల్లోని దుర్గాదేవి మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ఆసిఫాబాద్: పైకాజీనగర్‌లో..



బెజ్జూర్: దుర్గాదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



రెబ్బెన: ఖైరిగూర ఓసీపీ వద్ద దుర్గామాతకు పూజలు చేస్తున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి



ఆసిఫాబాద్‌అర్బన్: అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వంతెన నిర్మాణం చేపట్టాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బల్హాన్‌పూర్ -వెంకటాపూర్ గ్రామాల మధ్యలో నూతనంగా వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని సోమవారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించడంతో బల్హాన్‌పూర్, పార్వతిగూడ, నాయకపుగూడ, ఓటీఘాట్, సమితులగుండం గ్రామాలకు వచ్చే బియ్యం లోడ్ వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వంతెన నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కరెంట్ కోసం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని బాబేఝరీ మహరాజ్‌గూడలో గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నాలుగు రోజులుగా గ్రామానికి కరెంట్ సరఫరా నిలిచిపోయిందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. వెంటనే గ్రామానికి కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు గ్రామానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు రాథోడ్ గోపాల్, సుభాష్, ఎల్లయ్య, రాజు, చిన్ను, పండిత్ పాల్గొన్నారు.

11వ రోజుకు సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పని చేసే డైలీవేజ్ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ వేతనాలు అందించేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. పెండింగ్ ఏడు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. సీఐటీయూ ప్రభాకర్, కృష్ణమాచారి, వసంత్ రావు, కోటయ్య, భరత్, శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, తిరుపతి, దివ్య, మాన్కుబాయి పాల్గొన్నారు.

'ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: మీడియా స్వేచ్ఛను హరించిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహమాన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు ఫిర్యాదు చేశారు. మీడియా ప్రతినిధులను బెదిరించే విధంగా వ్యవహరించిన అధికారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌటాల: మండలంలోని తలోడి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్తులు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి సమయాల్లో గ్రామంలో విష పురుగులు సంచరిస్తున్నాయని, వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు సంతోష్, రాంచందర్, శ్రీనివాస్, రమేశ్, తిరుపతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.